కూన ప్రచారం.. జన ప్రమోదం

- బీజేపీకి బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- కుత్బుల్లాపూర్‌లో జోరుగా ప్రచారం
- పార్టీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో భారీగా చేరికలు
- కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థన


వడ్డెర సంఘం కులస్తుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పదేళ్లు మోసం చేసిన బీఆర్ఎస్‌కు ఓటేస్తే మరోసారి ప్రజలను నట్టేట ముంచడం ఖాయమని.. అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ బీజేపీకి మద్దతు తెలపాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సోమయ్యనగర్‌కు చెందిన రజక సంఘం అధ్యక్షుడు నాగరాజు తన అనుచరులతో కలిసి గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరగా వారికి శ్రీశైలంగౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

- సుభాష్‌నగర్ డివిజన్ అపురూపకాలనీకి చెందిన యువకులు మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కార్యకర్తలు శ్రీశైలంగౌడ్‌ను కలిసి తమ మద్దతు ప్రకటించారు.
- చింతల్ డివిజన్ పరిధి శివ నగర్, శ్రీ సాయి కాలనీ, రంగానగర్, సాగర్ అపార్ట్‌మెంట్స్, సిరి టవర్స్‌లలో విస్తృత ప్రచారం చేశారు.
- చింతల్ డివిజన్‌లో జరిగిన ప్రచార కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత సదానంద్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పలువురు నాయకులు శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కాలనీల అసోసియేషన్‌లతో సమావేశమైన శ్రీశైలంగౌడ్ వారి మద్దతు కోరారు.
- కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని కోరగా పలు కాలనీలు, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్‌లు ఆయనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి శ్రీశైలంగౌడ్ పార్టీ కండువాలు కప్పారు.
- కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం వడ్డెరలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసిందని, వారికి ఇళ్లు కేటాయించడంతో తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వడ్డెర కులస్తుల సంక్షేమానికి పెద్దపీట వేస్తానన్నారు. వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి సొంతింటి కలను సాకారం చేస్తానన్నారు. గతంలో తాను వడ్డెర కులస్తులకు 15 ఎకరాలు కేటాయించి ఇళ్ల స్థలాలు ఇచ్చానని ఆయన గుర్తు చేశారు. సంచార జాతుల కమిషన్ జాతీయ సభ్యులు తుర్క నరసింహ, వడ్డెర కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.
- గాజులరామారం డివిజన్ బీజేపీ నాయకుడు సుంకరి సాయిప్రతాప్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


బీజేపీ నాయకుడు సాయిప్రతాప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీశైలంగౌడ్




శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిన అపురూపాకాలనీ, భగత్‌సింగ్‌నగర్ వాసులు యువకులు, రజక సంఘం అధ్యక్షుడు నాగరాజు


రాచకొండ కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కూన


దుండిగల్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రచార సభకు హాజరైన జనం

తెలంగాణాలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన ప్రేమ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పిన కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి


ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని.. తెలంగాణాలో వచ్చేది తమ ప్రభుత్వమేనని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. దుండిగల్ గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు, యువత కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో తమ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రకటించిందన్నారు. ఈ గ్యారంటీలతో మహిళలు, అన్ని సామాజిక వర్గాలకు లబ్ధి చేకూరనుందన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని హన్మంతరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ నర్సారెడ్డి భూపతిరెడ్డి, కేపీ విశాల్‌గౌడ్, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, కుమార్‌యాదవ్, సాదుయాదవ్, బొంగునూరి కిశోర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– సుభాష్ నగర్ డివిజన్ సూరారం పరిధిలోని హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రెసిడెంట్ కె.స్వామి, సీఐటీయూ ప్రెసిడెంట్ దేవదానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హమాలీలు కొలన్ హన్మంతరెడ్డికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ యూసుఫ్, సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ తదితరులు ఉన్నారు.


కొలన్ హన్మంతరెడ్డికి మద్దతు తెలుపుతున్న సూరారం హమాలీ సంఘం నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ జ్ఞానేశ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ, ప్రపూర్ణ ఎన్‌క్లేవ్, రామరాజ్‌నగర్, మైఫ్రెండ్ సర్కిల్, ఆల్వాల్‌రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు..

- 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ,ఓం బుక్స్, మీనాక్షి ఎస్టేట్స్, అంగడిపేట్,మెట్రో వెనుక గల్లీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

యూనివర్సిటీల సమస్యలపై డిక్లరేషన్ చేయాలి

లాలాపేట: రాష్ట్రంలోని యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు డిక్లరేషన్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీల జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. యూనివర్సిటీలో చదివే ప్రతి విద్యార్థికి ఉచిత విద్యా, వసతి సౌకర్యం కల్పించాలని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులన్నింటిని రెగ్యులర్ కోర్సులుగా మార్చాలన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్‌ను పెంచడంతో పాటు పర్మినెంట్ ప్రొఫెసర్లకు 7వ సవరణ పే స్కేల్ బకాయిలను చెల్లించాలన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


అపురూపాకాలనీ టీవీఆర్ పాఠశాలలో..

జీడిమెట్ల: బాలల దినోత్సవం చిన్నారులకు పెద్ద పండగ అని టీవీఆర్ గ్రూప్స్ పాఠశాలల చైర్మన్ టి.కోటిరెడ్డి అన్నారు. మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని టీవీఆర్, సత్యవాణి, బచ్‌పన్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పాఠశాలకు చాచా నెహ్రూ, వివిధ వేషధారణల్లో వచ్చి పాఠశాలలో సందడి చేశారు. రోజంతా చిన్నారులు పాఠశాలలో ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గడిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాలలో చిన్నారుకలకు పాఠశాల యాజమాన్యం మిఠాయిలను పంచింది. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు దీప్తి, వంశీకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చింతల్ బచ్‌పన్ పాఠశాలలో..

ఊరు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

జగద్గిరిగుట్ట: పండుగకు ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు పడి ఇల్లు గుల్లైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్‌కు చెందిన వెంకటరాజు కుటుంబం దీపావళి పండుగకు వరంగల్‌కు వెళ్లారు. మంగళవారం ఉదయం 9గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 12 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రిజర్వాయర్‌కు లీకేజీ.. నీరు చాంబర్‌లోకి.!

చింతల్: కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రజలకు నీటి సమస్య తీర్చేందుకు నిర్మించిన 7 ఎంఎల్ రిజర్వాయర్‌కు లీకేజీలు తలెత్తినట్టు సిబ్బంది కోడై కూస్తోంది. 2016లో కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజల కోసం షాపూర్‌నగర్‌లోని 7 ఎంఎల్ రిజర్వాయర్‌ను ఓ ప్రముఖ ప్రైవేట్ సంస్థ నిర్మించింది. అయితే ఈ రిజర్వాయర్‌కు అనుబంధంగా ఉన్న చాంబర్‌లోకి నీరు వచ్చి చేరుతోంది. అయితే వర్షపు నీరు చాంబర్‌లో ఉన్న వాల్వ్ ద్వారా వచ్చి చేరినట్లు గతంలో సిబ్బంది గుర్తించారు.

- ఇదే విషయమై పలు పత్రికలలో ప్రచురితం కావడంతో కూకట్‌పల్లి జలమండలి అధికారులు షాపూర్‌నగర్‌లో ఉన్న 7 ఎంఎల్ రిజర్వాయర్ వద్దకు పంపి మరమ్మతులు చేపట్టాలంటే సిబ్బందిని పంపారు. చాంబర్‌లో ఉన్న నీటిని తోడి మరమ్మతులు చేపట్టేందుకు ఉపక్రమించగా నీరు ఎంత తోడినా నీరు తగ్గకపోవడంతో లీకేజీ ఏర్పడ్డట్టు గుర్తించి గుట్టు చప్పుడు కాకుండా అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.
- సదరు సిబ్బంది అధికారులకు లీకేజీలు ఉన్నట్లు తెలుపగా ఓ ప్రముఖ సంస్థ నిర్మించడం వల్లే మనం ఏం చేయలేమంటూ పోయినట్లు తెలుస్తోంది. చాంబర్‌లో ఉన్న వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టేందుకు మూడు రోజుల పాటు మోటార్లు బిగించి నీటిని తోడినా మరలా కాసేపటికి తిరిగి యథా స్థానానికి నీరు చేరుతుండటంతో పక్కనే ఉన్న రిజర్వాయర్ ద్వారానే నీరు చాంబర్‌లోకి వస్తుందన్న కోణంలో సిబ్బంది అధికారులకు తెలుపడంతో విషయం బయటపడినట్లు అయింది.
- అయితే రూ.7 కోట్లతో చేపట్టిన ఈ రిజర్వాయర్‌కు ఏర్పడిన లీకేజీని అరికట్టాల్సిన బాధ్యత జలమండలి అధికారులపై ఎంతైనా ఉంది. కోట్లాది రూపాయలతో చేపట్టిన ఈ రిజర్వాయర్ నిర్మాణ సంస్థపై జలమండలి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.


షాపూర్‌నగర్‌లో ఉన్న కూకట్‌పల్లి రిజర్వాయర్ చాంబర్‌లో చేరుతున్న నీరు

అభివృద్ధి, సంక్షేమాలే గెలిపిస్తాయి

కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీఆర్ఎస్‌కేవీ కో.ఆర్డినేటర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున మహిళలు, యువకులు వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలో రాష్ట్రాభివృద్ధికి చేసిందని శూన్యమని, ప్రతిక్షణం ప్రజా సంక్షేమం కోసం పనిచేసే బీఆర్ఎస్ పార్టీని నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలన్నారు.

- గాజులరామారం డివిజన్ ప్రిస్టిన్ ప్లేస్ అపార్ట్‌మెంట్స్‌లో కార్పొరేటర్ రావుల శేషగిరితో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం చేశారు. అభివృద్ధికి పట్టం కడుతూ తనను గెలిపించాలని ఆయన కోరారు. ప్రిస్టిన్ ప్లేస్ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ ఏ.ఆర్.కే.ప్రసాద్, సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు కస్తూరి బాలరాజ్, రషీద్ బేగ్, కమలాకర్, పర్వ శ్రీనివాస్ యాదవ్, మల్లేష్ పాల్గొన్నారు.
- చంద్రగిరినగర్‌లో జరిగిన ఎమ్మెల్యే వివేకానంద ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ రహీం, జావిద్, ఓవైసీల ఆధ్వర్యంలో జావీద్ మిత్ర బృందం సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు.
- చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఇర్ఫాన్, సల్మాన్, ఫిరోజ్‌ల ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌కు చెందిన వసీమ్‌తో పాటు పలువురు యువకులు, అదే విధంగా జగ్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ బీ-బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి సంతోష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.
- సూరారం డివిజన్ న్యూ శివాలయనగర్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో జై హనుమాన్ యూత్ సభ్యులు, మహిళలు, యువకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్ధిఖ్, సీనియర్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, తార భాయ్, గోపాల్ పాల్గొన్నారు.
- గాజులరామారం డివిజన్ ఓక్షిత ఎన్ క్లేవ్ లోని బీజేఆర్ అపార్ట్‌మెంట్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజెఆర్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎస్. రామ సుబ్బారెడ్డి, రామ సుబ్బారెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.
- చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మేదర సంఘం సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతు తెలిపారు.



జగద్గిరిగుట్టలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు


బీఆర్ఎస్‌లో చేరిన చంద్రగిరినగర్ యువకులతో ఎమ్మెల్యే


న్యూ శివాలయనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్న మేదర సంఘం సభ్యులు

ఎస్సీ ఉపకులాలను ఎస్సీ ఏ జాబితాలో చేర్చాలి

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ చేస్తే అందులో ఎస్సీ 57 ఉపకులాలను ఎస్సీ ఏ జాబితాలో ఉంచి బి జాబితాలో మాదిగలను, సీ జాబితాలో మాలలను పొందపర్చాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెకంటేశం మోచి మాట్లాడుతూ . రాష్ట్రంలో 17 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉండగా మొత్తం మాదిగలు, మాలలకు మాత్రమే కేటాయించారని 57 ఉపకులాలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా ఒక్క ఉపకులానికి అవకాశం ఇవ్వలేదన్నారు. కుల ధృవీకరణ పత్రం కూడా పొందలేకపోతున్నామని ఆర్‌డీవో ద్వారా కుల ధృవీకరణ తీసుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వర్గీకరణ సాధనకు పోరాడుతున్న నాయకులు తమ వాటా కోసం ఎందుకు పోరాటం చేయడం లేదన్నారు. కేంద్రం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేసి ఏ క్యాటగిరీలో తమను ఉంచి 22 లక్షల జనాభా ఉన్న ఉపకులాలకు వారి జనాభా దామాషాప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఎస్సీ ఉపకులాల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో చంద్రగిరి సత్యనారాయణ, రాయిల లక్ష్మినారాయణ, తులసిదాస్ గైక్వాడ్, తిమ్మయ్య, కుమార్, పరమేశ్వర్, సంతోష్, కేషవులు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌సీ యూకే ఫెలోగా సైంటిస్ట్ సిన్హా

లాలాపేట: ఐసీఎంఆర్–ఎన్ఐఎన్‌కు చెందిన సైంటిస్ట్ డాక్టర్.ఎస్.ఎన్ సిన్హా ప్రతిష్ఠాత్మకమైన యూకే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(ఆర్ఎస్‌సీ) ఫెలోగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈయన జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్)లో ఫుడ్ సేఫ్టీ విభాగానికి హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. సైంటిస్ట్‌గా ఫుడ్ సేఫ్టీలో పురుగుల మందులు, రసాయనాల కాలుష్యంపై తన పరిశోధల ద్వారా ఆహార భద్రతా రంగంలో గణనీయమైన కృషి చేశారు. కార్బోనేటెడ్ పానీయాలలో పురుగుల మందుల గరిష్ఠ అవశేషాల పరిమితులను నిర్ధయించడానికి క్లిష్టమైన ఆరోగ్య ప్రమాద అంచనా ఫ్రేమ్ వర్క్‌ను అభివృద్ధి చేశారు. దీనిని భారత ప్రభుత్వం జాయింట్ పార్లమెంట్ కమిటీ సైతం ఆమోదించింది. ఇటీవలే భారతదేశంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫెలోగా ఎన్నికయ్యారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సెషన్‌కు ప్రొ.అజీజుద్దీన్

రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ (ఏపీహెచ్‌సీ సెషన్‌లో హిస్టారియోగ్రఫీ విభాగానికి 'మనూ'లోని ఉర్దూ కల్చర్ స్టడీస్ సెంటర్ గౌరవ ప్రొ.ఎస్ఎం అజీజుద్దీన్ హుస్సేన్‌ను ఎంపిక చేశారు. 2024 జనవరిలో విశాఖపట్నంలో ఏపీహెచ్‌సీ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో హిస్టారియోగ్రఫీ విభాగానికి అధ్యక్షత వహించడానికి ప్రొ.అజీజుద్దీన్‌ను ఆహ్వానించారు.

బాడీ బిల్డింగ్‌లో సత్యనారాయణ రాజుకు కాంస్యం

మాదాపూర్: సౌత్ కొరియాలో జరిగిన 14వ ప్రపంచ బాడీబిల్డింగ్ , ఫిజిక్ స్పోర్ట్స్- 2023లో భారతదేశానికి చెందిన కటారి సత్యనారాయణరాజు మూడవ స్థానంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన ప్రపంచ బాడీబిల్డింగ్ పోటీలలో పాల్గొన్నారు. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో నివాసముంటున్న కటారి సత్యనారాయణ రాజు 2019 మిస్టర్ వరల్డ్ సిల్వర్ పతకం, 2022లో మిస్టర్ ఆసియా సిల్వర్ పతకం సాధించినట్లు తెలిపారు.

18, 19 తేదీల్లో కాశీనాథుని వారి విశ్వనాథ భక్తి

పంజగుట్ట: ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ సాంఘిక సినిమాలు తీసినప్పటికీ అంతర్లీనంగా భక్తిని ఎప్పుడూ వదలలేదని శాంతా వసంతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి అన్నారు. శాంతా వసంతా ట్రస్ట్, ధర్మవర్ధిని సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో 'కాశీనాథుని వారి విశ్వనాథ భక్తి' కార్యక్రమం ఖైరతాబాద్ లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ధర్మవర్ధిని సంస్థ చైర్మన్ షణ్ముక చరణ్‌తో కలిసి మాట్లాడుతూ .. ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ స్వర్గస్తులై ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కె.విశ్వనాథ్ సినిమాలోని కొన్ని భక్తిగీతాలను విశ్లేషించి నేటితరం వారికి ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుచే వాఖ్యానం చేస్తున్నట్లు తెలిపారు.

'అందరికి అందుబాటులో డయాబెటిస్ చికిత్స'

సుభాష్‌నగర్: వరల్డ్ డయాబెటీస్ డేను పురస్కరించుకుని మంగళవారం సూరారం మల్లారెడ్డి హెల్త్ సిటీలో 'అందరికి అందుబాటులో డయాబెటిస్ చికిత్స' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సిద్ధప్ప, సుమన్, సుమరెడ్డి, త్రివన్‌సాగర్, శంతన్, యుగంధర్, ధనుంజయ్, శ్రీనివాస్‌ల బృందం ఆధ్వర్యంలో 500 మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి డయాబెటీస్‌పై అవగాహన కల్పించారు.


సూరారం మల్లారెడ్డి హెల్త్ సిటీలో రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న దృశ్యం

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం


మదన్‌గౌడ్‌ను సత్కరిస్తున్న లక్షయ్ సైన్స్ పరిశ్రమ కార్మికులు

కుత్బుల్లాపూర్: కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా బీఆర్ఎస్‌కేవీ పనిచేస్తుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, రాష్ట్ర నాయకుడు ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేజ్-03లోని లక్షయ్ సైన్స్ పరిశ్రమ కార్మికుల నూతన వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పరిశ్రమ కార్మికులు మదన్‌గౌడ్‌ను సత్కరించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడికి రూ.12వేల వేతనం పెంపుదలతో పాటు అన్ని రకాల అలవెన్స్‌లు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికుల న్యాయబద్ధమైన హక్కుల కోసం తాను నిరంతరం పాటు పడతానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిగౌడ్, సుభాష్, రంగారావు, రాంబాబు, అశోక్‌గౌడ్, సురేష్‌బాబు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ముచ్చటగా మూడోసారి

రావినారాయణరెడ్డి నగర్ (ఈస్ట్) అధ్యక్షుడిగా నారాయణ ఏకగ్రీవం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డి నగర్ (ఈస్ట్) కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బి.నారాయణ మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి, పచ్చదనం కోసం కాలనీవాసులను ఏకం చేసి అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఒకప్పుడు కొండలు గుట్టలతో మురికివాడల ప్రాంతంగా ఉన్న రావినారాయణరెడ్డినగర్ ఈస్ట్ కాలనీలకు దీటుగా అభివృద్ధి చెంది గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆదర్శ బస్తీగా అవార్డు పొందిందన్నారు. కాలనీవాసులు మూడోసారి తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాలనీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.